క్లుప్తంగా

ఘనంగా అక్షయ తృతీయ వేడుకలు



అమ్మవారి సన్నిధిలో వేద మంత్రాలు పఠిస్తున్న చిన్నారులు

సబ్బవరం:ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో అక్షయ తృతీయ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు శ్రీమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు,అభిషేకాలు చేశారు. యంత్ర మహామేరు ప్రాంగణం ఈశాన్య దిక్కులో కొలువైన మహాలక్ష్మి అమ్మవారికి శ్రీసూక్త విధానంలో షోడశోపచార పూజ చేసి పంచామృతాభిషేకాలు నిర్వహించారు.అమ్మవారి ఉత్సవ మూర్తికి భక్తులు క్షీరాభిషేకం చేశారు. వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న బాలబాలికలు వేదమంత్రాలు పఠించారు. మహాలక్ష్మి హోమం జరిపించారు. గురుమాత అన్నపూర్ణమ్మ చేతులమీదుగా అన్నసమారాధన నిర్వహించారు.

ఎలక్ట్రిక్ బస్సు వచ్చింది



ఎలక్ట్రిక్ బస్సు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఎలక్ట్రిక్ బస్సు కొనుగోలు చేసింది. ఈ మేరకు బస్సు శుక్రవారం దేవస్థానానికి వచ్చింది. సింహగిరి ఘాట్‌రోడ్డులో ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టాలని గత ట్రస్ట్‌బోర్డు ఆమోదం తెలపడంతో సుమారు రెండు కోట్లు వెచ్చించి ఎలక్ట్రిక్ బస్సు కొనుగోలు చేశారు. త్వరలోనే బస్సు సేవలు అందుబాటులోకి తేనున్నట్టు అధికారులు తెలిపారు.

ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయండి



స్టీల్‌ప్లాంట్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ/పెదగంట్యాడ: దేశపాత్రునిపాలెం, స్టీల్ ప్లాంట్ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కాసు అంజిరెడ్డి, చిమ్మిటి అప్పారావు ఆధ్వర్యంలో దేశపాత్రునిపాలెం, స్టీల్ ప్లాంట్ సెక్టార్లలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ ఫ్యాను గుర్తుపై ఓటేసి తనను, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు చిమ్మిటి అప్పారావు, వై.వరలక్ష్మి పాల్గొన్నారు. అదీప్‌రాజ్‌కు మద్దతుగా 77వ వార్డు పిట్టవానిపాలెంలో బట్టు పైడిరెడ్డి, వెంకటరెడ్డి, సంజీవరెడ్డి ప్రచారం చేశారు.



పిట్టవానిపాలెంలో ప్రచారం చేస్తున్న పైడిరెడ్డి, వెంకటరెడ్డి, సంజీవరెడ్డి

బాలుడి ప్రాణం కాపాడిన కేజీహెచ్ వైద్యులు

మహారాణిపేట : తీవ్ర అనారోగ్యంతో కేజీహెచ్ పిల్లల వార్డులో చేరిన పది సంవత్సరాల బాలుడికి చక్కటి చికిత్స అందించిన వైద్యులు శుక్రవారం అతన్ని డిశ్చార్జి చేశారు. ఏప్రిల్ 10న విజయనగరానికి చెందిన దిలీప్ కుమార్ (10) తీవ్ర జ్వరం, కడుపు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి పలు సమస్యలతో నగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. అనంతరం అతన్ని మెరింత మెరుగైన ఆరోగ్యం కోసం అక్కడి నుంచి కేజీహెచ్ పిల్లల వార్డుకు తరలించారు. కేజీహెచ్ పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ బీవీ చక్రవర్తి ఆధ్వర్యంలో దిలీప్ కుమార్‌కు వైద్య సేవలు అందించారు. ఇటీవల కేజీహెచ్ పిల్లల వార్డులో ఆధునికీకరించిన పీఐసీయూలో బాలుడికి వైద్య సేవలందాయి. ఆధునికీకరణలో భాగంగా ఈ యూనిట్‌కు 6 వెంటిలేటర్లు, 3 హెచ్ఎఫ్ఎన్‌సీలు, 10 సెంట్రల్ ఎయిర్ కంప్రెషర్లు, 10 పడకలు ఏర్పాటు చేసిన సంగతి విదితమే. ఇటువంటి సౌకర్యాల వల్ల చక్కటి వైద్య సేవలంది బాలుడు బతికి బయట పడ్డాడు.

పెందుర్తిని మోడల్‌గా తీర్చిదిద్దుతా..

సాక్షి ఇంటర్వ్యూ

- అన్ని వర్గాలకు మేలు చేయాలన్నదే నా సంకల్పం
- 33 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చాం
- సంక్షేమం కింద రూ.2375 కోట్లు అందించాం
- సాక్షి ఇంటర్వ్యూలో పెందుర్తి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్



అన్నంరెడ్డి అదీప్‌రాజ్

నియోజక వర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలన్నదే నా సంకల్పం. తొలిసారి **ఎమ్మెల్యేగా** గెలిచి ప్రజలకు అందుబాటులో ఉన్నాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహ**న్‌రెడ్డి ఆశీస్సు**లతో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పని చేశాను. నియోజకవర్గంలో 33 **వేల మంది నిరు**పేదలకు సొంతింటి కల నెరవేర్చాను. కరోనా లాంటి విపత్కర పరిస్థితిలో ప్రజల చెంతనే ఉండి సేవలందించాను. ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితిలో పేదలందరికీ నిత్యావసరాలు, ఇతర వసతులు కల్పించాను. గడప గడపకూ మన ప్రభుత్వం అనే బృహత్తర కార్యక్రమం ద్వారా ప్రతి గడపకూ రెండు సార్లు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేశాను. ప్రజలు మరోసారి అవకాశం ఇస్తే పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ పరిష్కరించి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని సిట్టింగ్ ఎమ్మెల్యే, పెందుర్తి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించేలా ప్రత్యేక దృష్టిసారిస్తానన్నారు. పలు కీలక అంశాలను 'సాక్షి' ఇంటర్వ్యూలో అదీప్‌రాజ్ ప్రస్తావించారు. –పెందుర్తి

తొలిసారి ఎమ్మెల్యేగా మీ పనితీరును ఎలా విశ్లేషించుకుంటారు?

నాకు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అంటే ఎనలేని అభిమానం. నేను సర్పంచ్‌గా ఉన్న సమయంలో మా ప్రాంతంలో పేద ప్రజలకు సొంత నిధులతో ఇళ్లు కట్టిస్తాను అని చెబితే వెంటనే నన్ను ప్రోత్సహించారు. తర్వాత ఉమ్మడి విశాఖ జిల్లా యూత్ విభాగానికి అధ్యక్షుడిని చేశారు. అలా మొదలైన నా రాజకీయ జీవితంలో 2019 మరిచిపోలేని అనుభవం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాకు ఎమ్మెల్యే సీటు ఇచ్చి ఎమ్మెల్యే చేశారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలకు సేవలందించాను.

మీ ప్రభుత్వంలో ప్రజలకు ఎలాంటి మేలు జరిగింది?

సీఎం వైఎస్ జగన్ నవరత్నాల ద్వారా ప్రతీ గడపకూ మేలు చేసి దేశంలోనే రోల్ మోడల్‌గా నిలిచారు. ఇక పెందుర్తి విషయానికి వస్తే 33 వేల మం**దికి సొంతింటి కల నేరవేర్చాం. సంక్షేమం, అభివృద్ధి ద్వారా రూ.వేల కోట్లు లబ్ధి చేకూరింది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. అట్టడుగు** వర్గాలను ఆదుకోవడంతో వారు దర్జాగా జీవిస్తున్నారు.జగనన్న అమ్మఒడి, నాడు– నేడుతో పాఠశాలలను అభివృద్ధి చేశాం. ప్రజలకు చేరువగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించి ఆరోగ్య భరోసా కల్పించాం. ఆర్బీకేలు ఏర్పాటు చేసి అన్నదాతలకు ఎరువులు, విత్తనాల కష్టాలు తీర్చాం.

59 నెలల్లో నియోజకవర్గానికి ఏం చేశారు?

నియోజకవర్గంలోని శివారు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించి అభివృద్ధి చేశాం. కాపుల కోసం కల్యాణం మండపం నిర్మించాం. పార్కులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాం. ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని పులగానివానిపాలెం రోడ్డు విస్తరించి ప్రజల సమస్యలు పరిష్కరించాం. సుజాతానగర్ రోడ్లతో సబ్బవరం, పరవాడ మండలాల్లోని పలు అంతర్గత రహదారులను అభివృద్ధి **చేశాం.** సంక్షేమ పథకాల కింద నియోకవర్గ ప్రజలకు రూ. 2375 కోట్లు అందించాం.

మళ్లీ ఎమ్మెల్యేగా గెలిస్తే ఏం చేస్తారు?

నియోజకవర్గంలో ఎక్కువ మంది వ్యవసాయ రంగంపైనే ఆధారపడి ఉన్నారు. ఇప్పటికే ఆ రంగాన్ని అన్ని రకాలుగానా ముందుకు తీసుకువెళ్లాం. ఇంకా మిగిలిన సమస్యలను పరిష్కరిస్తాం. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్వయంగా బాధ్యత తీసుకుంటాను. దీర్ఘకాలికంగా ఉన్న కొన్ని సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. వాటిని ఈ దఫా కచ్చితంగా పరిష్కరిస్తాం. ప్రధానంగా రోడ్లు అభివృద్ధిపై దృష్టిసారిస్తాను. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పని చేస్తాను.

మీ ఎన్నికల ప్రచారం ఎలా సాగింది..ప్రజల స్పందన ఏంటి?

మా ఎన్నికల ప్రచారం ఒకటే నినాదంతో సాగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో మీకు మంచి జరిగిందా లేదా..జరిగితేనే ఓటేయండి..అని ధైర్యంగా అడిగాం. ప్రజలు మాకు అపూర్వ స్వాగతం పలికారు. 2104లో ఇదే కూటమి జత కట్టి గెలిచి పరిపాలించింది. అప్పుడు మేము చేసిన మంచిని చూసి ఓటేయండి అని ప్రజలను అడిగే ధైర్యం వారికి ఉందా? ప్రజలను మోసం చేయడానికి మరోసారి జత కట్టి వస్తున్నారు.

మీపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన విమర్శలకు మీ సమాధానం?

2009లో పవన్ కల్యాణ్ కుటుంబానికి చెందిన పీఆర్పీలో పంచకర్ల గెలిచారు. అప్పుడు నియోజకవర్గాన్ని దోచుకున్నాడు. తర్వాత టీడీపీలో చేరి యలమంచిలిలో గెలిచి అక్కడ అక్రమ క్వారీ తవ్వకాలు, బినామీ పేర్లతో పరిహారాలు అపహరించిన వ్యక్తి పంచకర్ల అని స్వయంగా పవన్ కల్యాణే 2019లో ఆరోపించారు. అదే వ్యక్తిని తన పార్టీ టికెట్ ఇచ్చి గెలిపించండి అని మళ్లీ పవన్ కల్యాణే అంటున్నారు. ఇలాంటి వలస పక్షులను నమ్మే పరిస్థితిలో పెందుర్తి ప్రజలు లేరు. 2014లో పెందుర్తిని విడిచి వెళ్లిన పంచకర్ల రమేష్‌బాబు పదేళ్ల తర్వాత ఇక్కడకు వచ్చి ఓట్లు అడగడానికి సిగ్గు ఉండాలి. కరోనా లాంటి విపత్కర పరిస్థితిలో వీరంతా ఎక్కడ ఉన్నారు. అలాంటి వారికి ఓటు అడిగే అర్హత ఉందా.

సీఎం జగన్‌తోనే సంక్షేమం

- ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయండి
- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- విస్తృతంగా ఎన్నికల ప్రచారం



పెదనాయుడుపాలెంలో ఓటు వేయడంపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



గొర్లివానిపాలెం ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న అభిమానులు

సబ్బవరం: వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు ప్రజల ముంగిటకు చేరుతాయని వైఎస్సార్‌సీపీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు.మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆదిరెడ్డిపాలెంలో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల మనస్సులో సుస్థిరమైన స్థానం సంపాదించుకున్నారన్నారు. సంక్షేమం,అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పాలన సాగించారని చెప్పారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజల చెంతకే ప్రభుత్వ పథకాలు,సేవలు అందించి దేశంలోని మిగిలిన రాష్ట్రాలకు జగన్ మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలిచారన్నారు.

వంచించడం బాబు నైజం

వంచనతో ప్రజలను మోసం చేయడానికి కూటమి పేరుతో వస్తున్న వారికి బుద్ధి చెప్పాలని అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. 2014 ఎన్నికల్లో 600లకు పైగా హామీలు ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసం చేసిన సంగతి తెలిసిందేనన్నారు. పింఛన్ల పంపిణీని సైతం అడ్డుకున్న దుర్మార్గుడు చంద్రబాబు అని మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనతో పాటు ఎంపీగా బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు,మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కొటాన రాము,ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు, మాజీ వైస్ ఎంపీపీ కొటాన కోటయ్య, పార్టీ సీనియర్ నాయకులు గొంప దేముడు తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా బ్రహ్మ రథం

సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధిలోని గొర్లివానిపాలెం,ఆదిరెడ్డిపాలెం,చిన్నయ్యపాలెం,పెదనాడుపాలెం,జోడుగుళ్ల,చినగొల్లలపాలెం గ్రామాల్లో అదీప్‌రాజ్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులు ఇచ్చి విజయ తిలకం దిద్దారు. గొర్లివానిపాలెంలో గొర్లి అచ్చెంనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, మాజీ ఎంపీపీ గొర్లి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

- పెదనాయుడుపాలెంలో ఉప సర్పంచ్ మండల లక్ష్మణ,మాజీ సర్పంచ్ మండల సముద్రం, సబ్బవరపు నాగభూషణం,వార్డు మెంబర్ గొర్లి శ్రీనివాసరావు,సబ్బవరపు సత్యనారాయణ,గొర్లి రమణ,సబ్బవరపు శివ,బోకం రామకృష్ణ పాల్గొన్నారు.
- చినగొల్లలపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో పల్ల కృష్ణ, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ,మాజీ సర్పంచ్ మండల సముద్రం తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం

వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు శ్రీనివాసరావు



పరవాడలో ఉపాధి కూలీలతో వైఎస్సార్‌సీపీ నేతలు



గంగునాయుడుపాలెంలో ఎన్నికల ప్రచారం సాగిస్తున్న నాయకులు

పరవాడ: ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటేసి పెందుర్తి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌ను, అనకాపల్లి ఎంపీగా బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పరవాడ ఉప సర్పంచ్ బండారు రామారావు శుక్రవారం ఉపాధి కూలీలను కలిశారు. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా జీవించాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటేసి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, పార్టీ నాయకులు పైల హరీష్, వెంకటరావు, వర్రి రమేష్, చుక్క వెంకటలక్ష్మి, పైల పైడింనాయుడు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య ఆధ్వర్యంలో శుక్రవారం నాయుడుపాలెం శివారు గంగునాయుడుపాలెం, వెంకటపతిపాలెం, రాముడుగారి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజాన ముత్యాలు, నాయకులు కూండ్రపు కృష్ణంనాయుడు, పైల ముత్యాలనాయుడు, కె.ఎస్.నాయుడు, యమహానాయుడు, శ్రావణ్‌కుమార్, డి.రాజేష్ పాల్గొన్నారు.

చందనోత్సవం విజయవంతం

- ఫలించిన అధికారుల ముందస్తు ప్రణాళిక
- హర్షం వ్యక్తం చేసిన భక్తులు



దర్శనానికి వచ్చిన దేవదాయశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కరికల్ వలవన్, కమిషనర్ సత్యనారాయణ



క్యూలో దర్శన టికెట్లు స్కాన్ చేస్తున్న దేవదాయశాఖ సిబ్బంది



మోనిటర్‌లో క్యూలో భక్తుల కదలికలు పరిశీలిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

పెందుర్తి/సింహాచలం: సింహాద్రి అప్పన్న చందనోత్సవం విజయవంతం అయింది. అధికారుల ముందస్తు ప్రణాళిక ఫలించింది. భక్తులు సాఫీగా స్వామిని దర్శించుకుని పులకించిపోయారు. అప్పన్నను నిజరూపంలో దర్శించుకోవడానికి వచ్చిన భక్తులను కొండ పైకి తరలించేందుకు ఉచిత రవాణా సదుపాయంకల్పించారు. గోశాల నుంచి కొత్త ఘాట్ వరకు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. యంత్రాంగం అనుక్షణం అప్రమత్తంగా ఉండడంతో భక్తులను నుంచి మన్ననలు అందుకున్నారు.

మస్కట్ నుంచి వచ్చా



అప్పన్నస్వామి నిజరూప దర్శనం కోసం మస్కట్ నుంచి వచ్చాం. అక్కడే స్థిరపడినా ఏటా చందనోత్సవం రోజు దర్శనం కోసం వస్తాం. ఈ ఏడాది ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయి. ఎక్కడా ఇబ్బంది లేకుండా దర్శనం చేసుకున్నాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేవు. – సుజాత, మస్కట్

హాయిగా దర్శనం



చందనోత్సవం ఏర్పాట్లు చాలా బాగున్నాయి. నేను ఉదయం 6 గంటలకు ఉచిత దర్శనం క్యూలోకి వెళ్లాను. సమారు 9.30 గంటల సమయంలో బయటకు వచ్చాను. క్యూలో ఎలాంటి అసౌకర్యం కలగలేదు. గతేడాది ఉచిత దర్శనానికి ఉదయం 6గంటలకు వెళ్తే సాయంత్రం అయింది. ఈసారి చాలా బాగా దర్శనం అయింది.
– సత్యవతి, సబ్బవరం

ఏర్పాట్లు భేష్



మేం కంచరపాలెం నుంచి వచ్చాం. మూడు గంటల్లో దర్శనం లభించింది. క్యూలు, బస్సులు ఎక్కే దగ్గర ఏర్పాట్లు బాగున్నాయి. పోలీసులు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ భక్తులను అప్రమత్తం చేశారు.
– ఎన్.సౌమ్య, తునుపు

స్వచ్ఛంద సంస్థల సేవలు భేష్

- చందనోత్సవానికి వచ్చిన భక్తులకు పానీయాలు, పండ్ల పంపిణీ



గోపాల్‌బాబు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అరటిపండ్లు పంపిణీ



సింహశైల సేవా సంఘం ఆధ్వర్యంలో పుచ్చకాయ ముక్కలు..



మజ్జిగ పంపిణీ చేస్తున్న విజయలక్ష్మి ట్రేడర్స్ సిబ్బంది



పులిహోర పంపిణీ చేస్తున్న విశాఖ ఆరువేల నియోగి బ్రాహ్మణ సంక్షేమ సంఘ సభ్యులు

సింహాచలం: చందనోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సింహగిరితో పాటు కొండదిగువన భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థలు సేవలందించాయి. సింహగిరిపై క్యూలైన్లతో పాటు,సింహగిరి బస్టాండ్, దక్షిణ రాజగోపుర మార్గం, కొండ దిగువ పాతగోశాల జంక్షన్, పాత అడవివరం జంక్షన్, సింహాచలం బస్టాండ్ తదితర ప్రాంతాల్లో భక్తులకు సేవలందించాయి. అడవివరం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో కొండపై ఆరు ప్రదేశాల్లో, కొండదిగువ ఆరు ప్రదేశాల్లో, యాత్రి కసదన్‌లో తాత్కాలిక ఆరు పడకలు ఏర్పాటు చేసి భక్తులకు వైద్య సేవలు అందించారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు అందించారు.

- దక్షిణరాజగోపురం మార్గంలో గోపాల్‌బాబు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అరిటిపండ్లు, పుచ్చకాయముక్కలు, కజ్జూరం పంపిణీ చేశారు.
- విశాఖకు చెందిన సింహశైల సేవా సంఘం ఆధ్వర్యంలో పుచ్చకాయ ముక్కలు, బిస్కట్లు, ఓఆర్ఎస్, మజ్జిగ అందించారు.
- ఎంవీపీ కాలనీకి చెందిన విజయలక్ష్మి ట్రేడర్స్ ఆధ్వర్యంలో మజ్జిగ, బిస్కట్లు,పానకం, మిఠాయి పంపిణీ చేశారు.
- సింహగిరి బస్టాండ్‌లో హరేరామ హరేకృష్ణ మూవ్‌మెంట్ సభ్యులు పానకం , చాగంటి సత్సంగ్ ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ చేశారు.



భక్తులకు వైద్య సేవలు అందిస్తున్న అడవివరం ఆరోగ్యకేంద్రం వైద్య బృందం



భక్తులకు మంచినీరు అందిస్తున్న జీవీఎంసీ సిబ్బంది



కొండపై బస్టాండ్‌లో చాగంటి సత్సంగ్ ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ

జర్ర అప్పారావుకు చందు పురస్కారం

సీతంపేట: ఆచార్య చందు సుబ్బారావు లిటరరీ అండ్ కల్చరల్ ట్రస్టు ప్రతి ఏటా ఇస్తున్న సాహిత్య సేవా పురస్కారం 2024 సంవత్సరానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య జర్ర అప్పారావుకు అందజేయాలని నిర్ణయించినట్టు ట్రస్టు కార్యదర్శి ఉప్పల అప్పలరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు సాహిత్యం, సంస్కృతికి పట్టుకొమ్మగా విలసిల్లుతున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ వికాసానికి జర్ర అప్పారావు చేసిన కృషి, నిబద్ధతకు గుర్తింపుగా ఈ నెల 18న విశాఖ పౌర గ్రంథాలయంలో ట్రస్టు నిర్వహించే సభలో అతిథుల చేతుల మీదుగా పురస్కారం ప్రదానం చేయనున్నట్టు తెలిపారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



వర్క్‌షాపు ప్రారంభోత్సవంలో సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సిన్హా

పరవాడ: బాలికలు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో పరవాడ, అనకాపల్లి మండలాల్లోని 28 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 120 మంది బాలికలకు గర్ల్ ఎంపవర్‌మెంట్ మిషన్(జీఈఎం–24) వర్క్‌షాపును ప్రాజెక్టు హెడ్ సిన్హా శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్క్‌షాపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యాస అవకాశాలను స్వీకరించి వ్యక్తిగతంగా ఎదగడానికి బాట వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్.ఆర్. పరిడా, సింహాద్రికి చెందిన జనరల్ మేనేజర్లు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, హెచ్ఆర్ హెడ్ బి.బి.పాత్ర, డీఎల్‌సీ అధ్యక్షులు అంజూసిన్హా, దీపిక లేడీస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.